లాహిరి..లాహిరి..లాహిరిలో

రేపే నాగై- శ్రీలంక మధ్య నౌకాయానం ● నేడు ట్రయల్ రన్


'శివగంగ' నౌక

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం ఓడరేవు నుంచి సోమవారం శ్రీలంకలోని కాంగేశన్ ఓడరేవుకుకు మళ్ళీ నౌకాయానం ప్రారంభం కానుంది. శ్రీలంకకు ప్రయాణికులతో 'శివగంగ' నౌక బయలుదేరనుంది. నాగపట్టినం నుంచి కాంగేశన్ ఓడరేవుకు ప్రయాణికుల నౌకాయాన సర్వీసును గతేడాది అక్టోబర్ 14న ప్రారంభమైంది. సెరియపాణి అనే నౌకలో ప్రయాణికుల నుంచి రూ.6500ల ఛార్జీగా వసూలు చేశారు. 18 శాతం జీఎస్టీతో కలిసి రూ.7670 వసూలు చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆ నౌకాయానాన్ని అక్టోబర్ 20న నిలిపివేశారు. ఆ నేపథ్యంలో మళ్ళీ శ్రీలంకకు నౌకాయానం ఈ నెల 13న ప్రారంభమవుతుందని అధికారులు ప్రకటించారు. ఈ నౌకాయానం కోసం అండమాన్‌లో 'శివగంగ' పేరుతో ఓ అందమైన నౌక కూడా తయారు చేశారు. ఈ నౌక శుక్రవారం మధ్యాహ్నం మద్రాసు హార్బర్‌కు వచ్చింది. ఆ తర్వాత రాత్రి హార్బర్ నుంచి బయలుదేరి శనివారం మధ్యాహ్నం నాగపట్టినం ఓడరేవుకు చేరింది. ఆదివారం ఆ నౌకను శ్రీలంకలోని కాంగేశన్ రేవుకు ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు. ఆ తర్వాత సోమవారం నౌకాయాన సేవలను ప్రారంభించనున్నారు. ఆ నౌక ఉదయం ఎనిమిది గంటలకు నాగపట్టినం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీలంకలోని కాంగేశన్ ఓడరేవు చేరుతుంది. అదే విధంగా కాంగేశన్ ఓడరేవు నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు నాగపట్టినం చేరుతుంది. ఈ నౌకలో ప్రయాణించడానికి రూ.4800ల ఛార్జీగా వసూలు చేస్తారు. 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.5662గా చెల్లించాల్సి ఉంటుంది.ఈనౌకలో ప్రయాణించడానికి www. sailindsri.com, md@indsri.ferry.co.in అనే వెబ్‌సైట్‌ల ద్వారా రిజర్వేషన్లు చేసుకోవచ్చునని నిర్వాహకులు ప్రకటించారు.

4 కౌంటర్ల ఏర్పాటు...

సోమవారం నుంచి ప్రయాణికులతో శ్రీలంక ప్రయాణించనున్న 'శివగంగ' ఓడలో 150 సీట్లున్నాయి. వీటిలో 27 సీట్లు ప్రీమియం క్లాసిక్ రకానికి చెందినవి. తక్కి123 సీట్లు క్లాసిక్ రకానికి చెందినవి. ఈ నౌకాయన సేవల కోసం నాగపట్టినం ఓడరేవు వద్ద ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ నౌకలో ప్రయాణికులు 60 కిలోల వరకు లగేజీ, తలా 20 కిలోల పార్శిళ్లు తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ఈ ఓడలో ప్రయాణికులు టీ, కాఫీ, ఆహార పదార్థాలకు వేర్వేరుగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామానుజుల అవతార వేడుకలు

శ్రీపెరుంబుదూరులో వైభవంగా రథోత్సవం

చెన్నై, మే11 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరులోని అత్యంత ప్రాచీనమైన ఆదికేశవ పెరుమాళ్ ఆలయం, భాష్యకారస్వామి (శ్రీమద్ రామానుజలు) ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ఆదికేశవ పెరుమాళ్‌కు జరిపే ఉత్సవాలను శ్రీమద్ రామానుజులవారికి కూడా నిర్వహిస్తారు. చిత్తిరై మాస ఉత్సవాల్లో ఆదికేశవ పెరుమాళ్‌కు పది రోజుల వేడుకలు, శ్రీమద్ రామానుజలవారి అవతార దినోత్సవాల పేరిట పది రోజుల పాటు వేర్వేరుగా నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదికేశవ పెరుమాళ్ ఆలయ చిత్తిరై ఉత్సవాలు ఏప్రిల్ 23న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ సింహ, గరుడ, శేష, హంస, సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాల్లో స్వామివారు ఊరేగారు. ఏప్రిల్ 29న ఆదికేశవ పెరుమాళ్ ఆలయ రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఈనేపథ్యంలో శనివారం ఉదయం శ్రీమద్ రామానుజులవారి 1007వ అవతారోత్సవంలో భాగంగా మహారథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. దీప, ధూప, కర్పూరనీరాజనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన మీదట సర్వాలంకరణ శోభితులైన శ్రీమద్‌రామానులవారు రథంలోని పీఠంపై కొలువుదీరారు.అతర్వాత రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని భక్తులు లాగుతూ వెళ్ళారు.ఈరథోత్సవంలో పాల్గొనేందుకు శ్రీపెరుంబుదూరు వాసులే కాకుండా పొరుగు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రథోత్సవ ఊరేగింపులో భక్తులు 'గోవింద నామాలతో ప్రతిధ్వనించింది. ఆలయ ప్రధాన వీధులలో ఊరేగిన రథం చివరగా రథ మండపం చేరుకుంది. ఈ వేడుకలలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు, పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తసంఘాల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, పానకం తదితర పానీయాలు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు కూడా జరిగాయి.

పళనిలో ప్రపంచ మురుగన్ భక్తుల మహానాడు

● ఏర్పాట్లపై మంత్రి శేఖర్‌బాబు సమీక్ష


మహానాడు జరుగనున్న ప్రాంతంలో అధికారులతో చర్చిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం దండాయుధపాణి కొలువైన పళని దివ్యక్షేత్రంలో ప్రపంచ మురుగన్ భక్తుల మహానాడు భారీ ఏర్పాట్ల నడుమ నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఆ మహానాడు ఏర్పాట్లపై పళని అరుళ్‌మిగు పళనియాండవర్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం సమావేశం జరిగింది. దీనికోసం రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పళని నగరానికి చేరుకుని, రోప్‌కార్‌లో కొండమీద స్వామి వారి ఆలయానికి వెళ్లి వేకువజాము పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మారిముత్తు ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పంచామృతం తయారు చేస్తున్న ప్రాంతాన్ని, వాటిని విక్రయించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు. తర్వాత పళనియాండవర్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మురుగ భక్తుల మహానాడు ఏర్పాట్లపై చర్చించేందుకు అధికారులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ద్రావిడ తరహా పాలనలో ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంలో ఏర్పాటైన ఉన్నత కార్యాచరణ కమిటీ సమావేశం ఫిబ్రవరిలో జరిగిందని, ఆ సమావేశంలో దేవాదాయ శాఖకు సంబంధించి పది తీర్మానాలు ఆమోదించామని, అందులో తమిళుల ఆరాధ్య దైవం మురుగన్ భక్తుల మహానాడు భారీ ఏర్పాట్ల నడుమ నిర్వహించాన్న తీర్మానం కూడా ఉందన్నారు. ఆ మేరకు పళని క్షేత్రంలో ప్రపంచ మురుగ భక్తుల మహానాడు నిర్వహించనున్నామని, ఆ మహానాడు జూన్ లేదా జూలైలో జరుగుతుందని చెప్పారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఆ మహానాడులో ప్రపంచ వ్యాప్తంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల ట్రస్టీలు, నిర్వాహకులు పాల్గొంటారని, తమ అంచనా ప్రకారం సుమారు 500 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. విదేశాల నుంచి వచ్చే మురుగన్ ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు, ట్రస్టీలు, ప్రతినిధులకు ఉచిత బస, రవాణా సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈ మహానాడులో సుబ్రహ్మణ్యస్వామివారి కీర్తిని వ్యాపించేసేలా ప్రత్యేక పరిశోధనలు, సదస్సులు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మహానాడును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే పళని ఆలయ కుంభాభిషేకం రూ.98 కోట్లతో నిర్వహించినట్లు మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో జీర్ణోద్ధరణకు ప్రభుత్వం రూ.100 కోట్ల మేరకు నిధులు కేటాయించిందని, ప్రైవేటు భాగస్వామ్యంగా రూ.200 కోట్ల మేర విరాళాలసేకరించినట్లు తెలిపారు. ఇదే విధంగా తిరుత్తణి, తిరుప్పరం కుంద్రం ఆలయాల్లోనూ జీర్ణోద్ధరణ పనులు జరుగుతాయని చెప్పారు. రాష్ట్రంలో 26 రామాలయాలకు కూడా కుంభాభిషేకాలు నిర్వహించామని, వీటన్నింటిని బట్టి ద్రావిడ తరహా పాలన అందించే డీఎంకే ప్రభుత్వం మతాలకు, ఆధ్యాత్మికానికి వ్యతిరేకం కాదని స్పష్టమవుతుందని చెప్పారు. దైవదర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించి ఆలయాలను పరిశుభ్రంగా ఉంచడంపైనే దేవాదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

మదురైలో మండుటెండలో కుండపోత

లోతట్టు ప్రాంతాలు జలమయం ● వైగై నదిలో పెరిగిన నీటిమట్టం


మదురై తెప్పకుళం ప్రాంతం వద్ద కురుస్తున్న వర్షం

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): మదురైలో శనివారం కురిసిన అకాల వర్షం వాతావరణాన్ని చల్లబరిచినప్పటికీ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నియాకుమారి సముద్రతీర ప్రాంతంలో వాతావరణంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అగ్నినక్షత్రం ఎండల బారి నుంచి ప్రజలు ఉపసమనం చెందుతున్నారు. మదురై జిల్లాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ 34 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. మదురై నగరంలోని అన్నానగర్, కేకేనగర్, తెప్పకుళం, సింహక్కల్, తెర్క్‌వాసల్, కాళవాసల్, పెరియార్ బస్టాండు ప్రాంతం, ఆరంపాళయం, క్రాస్‌రోడ్డు, సెల్లూరు, తందనేరి, సర్వేయర్ కాలనీ, ఐయ్యర్ బంగళా తదితర ప్రాంతాల్లో వర్షానికి వాతావరణం చల్లబడింది.. రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ అకాల వర్షానికి మదురైలోని వైగై నది నీటిమట్టం పెరగడంతో అధికారులు పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అప్రమత్తం చేశారు. వైగై నది నుండి రామనాథపురం జిల్లాలో సెకనుకు 3 వేల ఘనపుటడుగుల చొప్పున సాగునీరు విడుదల చేస్తున్నారు.

విహార యాత్రలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం



నందన - ఇందుమతి (ఫైల్‌ఫోటోలు)

పెరంబూర్, మే 11: కడలూరు జిల్లా రామనత్తం సమీపంలోని జాతీయ రహదారిలో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనున్న గుంతలో పడిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు. తంజావూరు జిల్లా వల్లద ప్రాంతానికి చెందిన రేఖ, ఎనిమిది మంది బంధువులతో కలసి పుదుచ్చేరికి విహార యాత్రకు బయల్దేరారు. శుక్రవారం అర్ధరాత్రి ఎళుత్తూర్ మార్గంలో వారు ప్రయాణిస్తున్న కారు టైర్ హఠాత్తుగా పేలింది. దీంతో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడింది. ఈ ఘటనలో ఇందుమతి, రేఖ కుమార్తె నందన (14) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పెరంబలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక కారు డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

అక్షయతృతీయ ఎఫెక్ట్.....

రూ.14,000 కోట్లకు పసిడి అమ్మకాలు

● రెండో రోజూ దుకాణాల్లో తగ్గని రద్దీ


నగలషాపులో నెక్లెస్ ధరించి అద్దంలో చూసుకుంటున్న యువతి

ప్యారీస్, మే 11: అక్షయ తృతీయ పర్వదినం రోజైన శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా రూ.14,000 కోట్ల మేర పసిడి విక్రయాలు జోరుగా సాగిన నేపథ్యంలో, రెండో రోజైన శనివారం కూడా నగల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అక్షయ తృతీయ సందర్భంగా బంగారం కొంటే ఇంట మహాలక్ష్మి శాశ్వతంగా తిష్టవేస్తుందనే నమ్మకం ఇటీవల కాలంలో అధికం కావడంతో మహిళలు పోటీపడి నగలు కొనడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఏడాది అక్షయతృతీయ శుక్రవారం రావడంతో మహిళలు నగరంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న నగల దుకాణాలకు వెళ్లి బంగారు ఆభరణాలను కొనుగోలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 4.17 గంటలకు ప్రారంభమైన అక్షయ తృతీయ శుభముహూర్తం శనివారం మధ్యాహ్నం 2.50 గంటల వరకు కొనసాగింది. అక్షయ తృతీయను పురస్కరించుకొని రాష్ట్రంలో పలు నగల దుకాణాలు రాయితీ కూడా ప్రకటించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 45,000లకు పైగా చిన్నా, పెద్ద నగల దుకాణాలు, రాజధాని నగరంలోని 5,000లకు పైగా నగల దుకాణాలను శుక్రవారం ఉదయం 6 గంటలకే తెరచి ప్రత్యేక పూజల అనంతరం అమ్మకాలు ప్రారంభించారు. జ్యువెలరీ షాపులు అధికంగా ఉన్న టి.నగర్, పురుషవాక్కం, మైలాపూర్, ప్యారీస్, వాషర్‌మెన్‌పేట, తాంబరం, క్రోంపేట, పోరూర్, పాడి, అడయార్, పెరంబూర్, మూలకడ ప్రాంతాల్లోని నగల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసి కనిపించాయి. ఇక, బంగారు డాలర్లు కొనుగోలు చేసేందుకు దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటయ్యాయి. రెండో రోజైన శనివారం కూడా అదే స్థాయిలోనే అమ్మకాలు జరిగినట్లు జ్యువెలరీ షాపుల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఒకేరోజు మూడు సార్లు పసిడి ధరలు పెరిగాయి.. శనివారం పసిడి ధరల్లో కొంత మార్పు కనిపించింది. గ్రాముకు రూ.20 తగ్గి రూ.6750కి విక్రయించారు. గత ఏడాది అక్షయతృతీయ సందర్భంగా 20 టన్నుల మేర నగల అమ్మకాలు సుమారు రూ.11,000 కోట్లకు జరుగ్గా, ఈ సంవత్సరం శుక్రవారం ఒకేరోజులో 25 టన్నుల పసిడి విక్రయాలు జరిగాయి.

కాంగ్రెస్ నేత హత్య కేసులో వీడని మిస్టరీ



జయకుమార్, రామజయం (ఫైల్‌ఫొటోలు)

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సీనియర్ కాంగ్రెస్ నేత జయకుమార్ ధనసింగ్ హత్య జరిగి ఎనిమిది రోజులు దాటినా హంతకులెవరో తెలియక పోలీసులు సతమతమవుతున్నారు. జయకుమార్ హత్య కేసు తిరుచ్చిలో జరిగిన మంత్రి నెహ్రూ సోదరుడు రామజయం హత్య కేసులాగా ఓ మిస్టరీగా మారిపోతుందేమోనని కూడా ఆందోళన చెందుతున్నారు. తిరునల్వేలి తూర్పు జిల్లా కాంగ్రెస్ నేత జయకుమార్ ధనసింగ్ (60) ఈ నెల రెండో తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకువెళ్ళి తిరిగిరాలేదు. మూడు రోజుల తర్వాత తన తోటలో కాళ్లు చేతులు కట్టబడి, కాలిన స్థితిలో శవంగా పడి ఉండగా గుర్తించారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం జయకుమార్ దారుణ హత్యకు గురైనట్టు స్పష్టమైంది. ఆయన గొంతులో స్టీల్ సామాన్లు కడిగేందుకు ఉపయోగించే క్లీనింగ్ ఐరన్ బ్రష్ ముక్కలున్నట్టు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది.. వీటన్నింటి బట్టి ఆయనది అనుమానాస్పద మృతి కాదని, హత్యేనని ప్రకటించిన పోలీసులు హంతకుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. హత్యకు ముందు జయకుమార్ డీఎస్పీకి, కుటుంబ సభ్యులకు వేర్వేరుగా లేఖలు కూడా రాశారు. అందులో తనకు అప్పులు చెల్లించాల్సివారి పేర్లు, తాను అప్పులు తీసుకున్న వారి పేర్లను రాసిపెట్టారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సహా ఐదుగురి ద్వారా తన ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నట్లు ఆ లేఖలలో అనుమానం వ్యక్తం చేశారు. ఆ నేపథ్యంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తంగబాలు సహా సుమారు 30 మందిని పోలీసులు విచారణ జరిపినా కానీ హత్యకు సంబంధించి ఒక్క క్లూ కూడా సాధించలేకపోయారు.

సెల్‌ఫోన్లు మాయం.. : ఇదిలా ఉండగా జయకుమార్ ఉపయోగించిన రెండు సెల్‌ఫోన్లు మాయమైనట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఆ సెల్‌ఫోన్లు లభిస్తే కీలకమైన సమాచారం లభిస్తుందని భావిస్తున్నారు. జయకుమార్ మృతదేహం లభించిన ప్రాంతానికి చేరువగా ఉన్న బావిలో సెల్‌ఫోన్లు పడి ఉంటాయని అనుమానించి పోలీసులు ఆ బావిలో గాలిస్తే సెల్‌ఫోన్లు లభించడానికి బదులు వేట కొడవలి దొరకడంతో దిగ్భ్రాంతి చెందారు. జయకుమార్‌ను హత్య చేసేందుకు ఆ వేటకొడవలిని హంతకులు ఉపయోగించి ఉంటారని భావిస్తున్నారు. ఇక జయకుమార్ అదృశ్యం కావాడానికి ముందు ఆయన ఏయే ప్రాంతాలకు వెళ్లారనే వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు.

డీఎన్ఏ పరీక్షలు...

ఇక సగం కాలిన స్థితిలో జయకుమార్ తోటలో లభించిన శవం ఆయనది కాదేమోనని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. డీఎన్ఏ పరీక్ష చేసి ఆ శవం జయకుమార్‌దేనా అని నిర్ధారించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు పోలీసులు మృతదేహంలోని భాగాలను డీఎన్ఏ పరీక్షలకు పంపారు. ప్రస్తుతం వాటి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

రామజయం కేసుగా మారేనా?

ఎనిమిది రోజులు దాటినా జయకుమార్ హత్యకేసులో కీలకమైన ఆధారాలు లభించకపోవడంతో 2012లో తిరుచ్చిలో మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడు రామజయం అదృశ్యం కేసులా మిస్టరీగా మారుతుందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. 2012 మార్చి 29న ఇంటి నుంచి వాకింగ్‌కు బయలుదేరిన రామజయం అదృశ్యమయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను కిడ్నాప్ చేసుకెళ్ళి హతమార్చినట్లు పోలీసులు తెలుసుకున్నారు. గాలించిన తరువాత రామజయం మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. జయకుమార్‌లాగే రామజయం కాళ్లు చేతులను కూడా సన్నటి కమ్మీలతో కట్టి ఉంచారు. రామజయం మృతదేహంపై పావుశాతానికి పైగా కాలిన గాయాలున్నట్లు కనుగొన్నారు. ఆయన నోట్లో గుడ్డపెట్టారు. జయకుమార్ నోటి నుంచి కేకలు బయటకు రాకుండా సామాన్లను కడిగేందుకు వాడే ఇనుప బ్రష్ ముక్కలను పెట్టారు. ఇలా ఇద్దరి హత్యకేసులకు కొన్ని పోలికలుండటంతో జయకుమార్ హత్యకేసు కూడా మిస్టరీగా మిగిలిపోతుందేమోనని ఆయన కుటుంబీకులే కాకుండా పోలీసులు కూడా అనుమానపడుతున్నారు.

చిదంబరం పరామర్శ...


జయకుమార్ సోదరుడిని పరామర్శిస్తున్న చిదంబరం

ఇదిలా ఉండగా కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం శనివారం ఉదయం ఉవరి ప్రాంతంలోని జయకుమార్ ధనసింగ్ కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు. జయకుమార్ సోదరుడు సెల్వరాజ్ ఇతర కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. జయకుమార్ హత్యకేసుపై పోలీసులు జరుపుతున్న దర్యాప్తు వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు.

సమాచార ధ్వని

14న రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, మే 11: టీఎన్‌పీఎస్సీ భర్తీచేయనున్న ఖాళీ పోస్టులకు ఈ నెల 14వ తేది రెండో తేది సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ జరుగనుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి గత ఏడాది మే 27వ తేది టీఎన్‌పీఎస్సీ రాతపరీక్ష నిర్వహించి, ఫలితాలు, ర్యాంకుల జాబితా సెప్టెంబరు 19వ తేది విడుదల చేసింది. తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగింది. రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో ఈ నెల 14వ తేది జరుగనుంది.

గిండి చిల్డ్రన్ పార్క్ పునరుద్ధరణ

ఐసిఎఫ్, మే 11: వివిధ సౌకర్యాలతో గిండి చిల్డ్రన్ పార్క్ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పార్క్‌ను ఏడాదికి సుమారు 8 నుంచి 9 లక్షల మంది సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో, రూ.20 కోట్లతో పార్క్ పునరుద్ధరణ పనులు ఇటీవల ప్రారంభమై ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి కాగానే ముఖ్యమంత్రి కానీ మంత్రులెవరైనా పార్క్ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

13న వైకాశి ఉత్సవాలు

ఐసిఎఫ్, మే 11: నరసింహ పెరుమాళ్ ఆలయంలో ఈ నెల 13వ తేది వైకాశి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. చెంగల్పట్టు సమీపం సింగపెరుమాళ్ ఆలయంలోని నరసింహ పెరుమాళ్ ఆలయంలో ఏటా వైకాశి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఉత్సవాలు 13 నుంచి 27వ తేది వరకు 15 రోజులు జరుగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని 14వ తేది ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహనంపై నరసింహస్వామి విహరించనున్నారు. 15వ తేది గరుడసేవ, సాయంత్రం హనుమంత వాహనం, 16న ఉదయం శేష వాహనంపై స్వామి దర్శనమిస్తారు. అనంతరం ఏకాంతసేవ, తిరుమంజనం, సాయంత్రం చంద్రప్రభ వాహన ఊరేగింపు ఉంటుంది. వేడుకల్లో ప్రధానాంశమైన రథోత్సవం 19వ తేది జరుగనుంది.

దక్షిణాది భాషలపై శిక్షణ

ఐసిఎఫ్, మే 11: హిందీ మాట్లాడే రైల్వే ఉద్యోగులకు దక్షిణాది భాషలు మాట్లాడేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై కేంద్రంగా దక్షిణ రైల్వే పనిచేస్తోంది. ఈ విభాగంలో రైల్వే నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య విభాగం, భద్రత వంటి వివిధ శాఖల్లో 90,000 మందికి పైగా పనిచేస్తున్నారు. వారిలో 50 శాతం మంది హిందీ మాట్లాడేవారే ఉన్నారు. వీరికి తమిళంతో పాటు ఇతర ప్రాంతీయ భాషలపై శిక్షణ ఇచ్చేందుకు దక్షిణ రైల్వే చర్యలు చేపట్టింది. భాషా సంగమం యాప్ ద్వారా ఈ శిక్షణా తరగతులు జరుగనున్నాయని అధికారులు తెలిపారు.

నేడు చెన్నై బీచ్-చెంగల్పట్టు రైలు సేవల్లో మార్పులు

ఐసిఎఫ్, మే 11: చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు వెళ్లే సబర్బన్ రైళ్లు ఆదివారం సింగపెరుమాళ్ ఆలయం వరకే నడువనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. చెంగల్పట్టులో ఉదయం 11.10 నుంచి మధ్యాహ్నం 12.25 గంటల వరకు మరమ్మతులు జరుగనున్నాయి. ఈ కారణంగా ఆదివారం చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.25, 10.00 గంటలకు చెంగల్పట్టు వెళ్లే రైళ్లు సింగపెరుమాళ్ స్టేషన్ వరకే నడువనున్నాయి. మరో మార్గంలో అదే రోజు ఉదయం 11.20, మధ్యాహ్నం 12 గంటలకు చెంగల్పట్టు నుంచి చెన్నై బీచ్ బయల్దేరే రైళ్లు చెంగల్పట్టు బదులుగా సింగపెరుమాళ్ స్టేషన్ నుంచి బయల్దేరనున్నాయి.

అదనపు బోగీ అనుసంధానం...

ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-చెన్నై సెంట్రల్ మధ్య నడిచే వారాంతపు సూపర్‌ఫాస్ట్ రైలు 13వ తేది నుంచి జూన్ 11వ తేది వరకు బెర్త్ సౌకర్యం కలిగిన అదనపు బోగీతో నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

14న ప్లస్ వన్ పరీక్షా ఫలితాలు

పెరంబూర్, మే 11: ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు ఈ నెల 14వ తేది విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది. గత మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించిన ప్లస్ వన్ పరీక్షలకు సుమారు 8 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వాటి ఫలితాలు మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. విద్యార్థులు dge.tn.nic.in అనే వెబ్‌సైట్‌కు వెళ్లి TN XI Result 2024 లేదా 11న పరీక్షా ఫలితాలు 2024 అనే లింక్ క్లిక్ చేయాలి. తమ హాల్‌టిక్కెట్టు నెంబరు, పుట్టిన తేది నమోదుచేసి, 'కాప్చా'ను పూర్తి చేసి సబ్మిట్ చేసి మార్కులు తెలుసుకోవచ్చు. అలాగే, దరఖాస్తులో విద్యార్థులు పేర్కొన్న నెంబరుకు ఫలితాలు, మార్కుల వివరాలను ఎస్‌ఎంఎస్ పంపనున్నారు. విద్యార్థులు తాము చదువుతున్న కళాశాలకు వెళ్లి ఫలితాలు తెలుసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

డిగ్రీలో అడ్మిషన్లకు 1.12 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, మే 11: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సర డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఇటీవల ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం గణాంకాల ప్రకారం డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 20వ తేది వరకు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

మాదకద్రవ్యాలపై సీఎస్ సమీక్ష

పెరంబూర్, మే 11: రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా శనివారం అధికారులతో సమావేశమయ్యారు. హోం శాఖ కార్యదర్శి, డీజీపీ, నగర పోలీస్ కమిషనర్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నమోదైన మాదకద్రవ్యాల అక్రమ తరలింపు, విక్రయాలకు సంబంధించిన కేసులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు సహా పలు అంశాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో మాదకద్రవ్యాల చెలామణీ అధికమైందనే ప్రతిపక్షాల నేపథ్యంలో ఈ సమావేశం జరగడం గమనార్హం.

ఇంజనీరింగ్ కోర్సులకు 94,939 దరఖాస్తులు

పెరంబూర్, మే 11: ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 94,939 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సుల మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్‌లో ఈ నెల 6వ తేది ప్రారంభం కాగా, శనివారం సాయంత్రం 6 గంటల వరకు 94,939 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రాజీనామా వెనక్కి తీసుకున్న ఐఏఎస్ అధికారి

పెరంబూర్, మే 11: ఐఏఎస్ అధికారి అనీష్ శేఖర్ తన రాజీనామా ఉపసంహరించుకున్నారు. ఎల్కాట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న అనీష్ శేఖర్ మార్చిలో ఆ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం రాజీనామా ఉపసంహరించుకున్న ఆయన, తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

శివకాశిలో మరో కర్మాగారంలో పేలుడు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివకాశి సమీపం నారాయణపురం పుదూరు వద్దనున్న బాణసంచా కర్మాగారంలో శనివారం ఉదయం పేలుడు సంభవించింది. బాణ సంచా తయారీకి రసాయన ముడిపదార్థాలు భద్రపరచిన గదిలో సంభవించిన ఈ పేలుడులో మూడు గదులు నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో కార్మికులెవరూ రాకపోవడంతో ప్రాణగండం తప్పింది. మూడు రోజుల క్రితం బాణా సంచా కర్మాగారంలో పేలుడు సంభవించి పదిమంది కార్మికులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 14 మంది ఇంకా ఆసుపత్రిలో చికిత్సలందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మరో బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించడం కలకలం సృష్టించింబది. విరుదునగర్ జిల్లాలో ఈ నెలలోనూ బాణసంచా కార్మాగారాల్లో ఐదుసార్లు పేలుడు ప్రమాదాలు సంభవించాయి.



పేలుడులో ధ్వంసమైన గదులు

మదురైలో సీఐ నివాసంలో చోరీ !

250 సవర్ల నగలు, రూ.5లక్షల దోపిడీ

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఓ మహిళా సీఐ నివాసంలో గుర్తు తెలియిన వ్యక్తులు చొరబడి 250 సవర్ల నగలు, రూ.5లక్షల నగదు దోచుకెళ్లారు. మదురై జిల్లా అలంగానల్లూరు సమీపంలోని పాసింగాపురం మీనాక్షి నగర్‌కు చెందిన షర్మిల (46) దిండుగల్ జిల్లా నిలకోట సమీపంలోని విలాంబట్టి పోలీసుస్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. షర్మిల గురువారం ఉదయం విలాంబట్టిలో డ్యూటీకి వెళ్ళి శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి రాగా ప్రధాన ద్వారం తలుపులు తెరచి వుండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. ఇంటిలోనికి వెళ్ళి చూడగా బీరువా తలుపులు పగులగొట్టి అందులోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని 250 సవర్ల బంగారు నగలు, రూ.5లక్షల నగదు దోపిడీకి గురైనట్లు తెలుసుకున్నారు. వెంటనే షర్మిల అలంగానల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వేలిముద్రల నిపుణులను వెంటుబెట్టుకుని హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. పోలీసు జాగిలాన్ని కూడా రంగంలోకి దింపారు. దోపిడీకి గురైన నగలు, నగదు మొత్తం విలువ రూ.1.30 కోట్లని పోలీసులు తెలిపారు. దోపిడీ దొంగల ఆచూకీ కోసం తీవ్ర గాలింపు చర్యలు ప్రారంభించారు.



దోపిడీకి గురైన నివాసగృహం

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు



పెరంబూర్, మే 11: తిరుచ్చి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. తిరుప్పూర్ తారాపురం రోడ్డుకు చెందిన పాల్‌పాండికు కౌసల్యతో వివాహమైంది. గర్భంతో ఉన్న కౌసల్య గత నెల 15వ తేది ప్రసవం కోసం తిరుప్పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో చేరింది. అదే రోజు ఆమెకు నొప్పులు రావడంతో సిజేరియన్ చేయగా ముగ్గురు పిల్లలు జన్మించారు. వారిలో ఒక ఆడ, ఇద్దరు మగశిశువులున్నారు. అలాగే, ఇద్దరు శిశువులు ఒకటిన్నర కిలో, మరొక శిశువు 1.750 కిలోల బరువు ఉన్నారు. ఈ శిశువులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో వారిని ఇంక్యుబిలేటర్ ఉంచి వైద్య నిపుణులు చికిత్స అందించారు. పిల్లల వైద్యనిపుణులు ఉమాశంకర్ నేతృత్వంలోని వైద్యుల బృందం చికిత్స చేయడంతో ముగ్గురు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారు. 25 రోజుల అనంతరం కౌసల్య తన ముగ్గురి పిల్లలతో ఇంటికి చేరుకుంది. మెరుగైన వైద్య చికిత్సలు, పర్యవేక్షణ చేపట్టిన వైద్య బృందాన్ని ఆసుపత్రి డీన్ మురుగేశన్ అభినందించారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ... కుమార్తె కంటే తల్లికే ఎక్కువ మార్కులు



పెరంబూర్, మే 11: మనప్పారై సమీపంలో తల్లి, కుమార్తె ఒకేసారి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. అందులో కుమార్తె కన్నా తల్లి ఐదు మార్కులు ఎక్కువ తెచ్చుకుంది. తిరుచ్చి జిల్లా మనప్పారై సమీపం వడక్కుసేరపట్టికి చెందిన తుమ్మాయి (37) 9వ తరగతి వరకు చదువుకొని, అదే ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో అల్పాహార పథకంలో వంటమనిషిగా పనిచేస్తుంది. ఆమె కుమార్తె యోగేశ్వరి. తల్లి పనిచేస్తున్న పాఠశాలలోనే 10వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయుల సహకారంతో తుమ్మాయి ప్రైవేటుగా పదవ తరగతి పరీక్షలు రాసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తుమ్మాయికి 358 మార్కులు, ఆమె కుమార్తె యోగేశ్వరికి 353 మార్కులు వచ్చాయి. ఈ విషయమై తుమ్మాయి మాట్లాడుతూ... చదువు అంటే తనకు ఎంతో ఇష్టమని, 2006లో 9వ తరగతి ఉత్తీర్ణత సాధించగా, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మానేయాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం అల్పాహారం పథకంలో వంట మనిషిగా పనిచేస్తూ, చదువుకోవాలనే ఆశతో, ప్రైవేటుగా పరీక్షలు రాసి పాసవ్వడం ఆనందంగా ఉందని తెలిపింది.

టెన్త్ టాపర్‌కు రూ.లక్ష ఆర్థికసాయం

పార్రీస్, మే 11: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో రూ.500 మార్కులకు 499 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన కావ్యజననికి పురచ్చితలైవి పసుమై తమిళగం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీఎస్ సుందర్‌రాజన్ రూ. లక్ష ఆర్థిక సాయం చేసి అభినందించారు. రామనాథపురం జిల్లా కముది ప్రాంతంలోని రెహ్మానియా మెట్రిక్యులేషన్ పాఠశాలలో టెన్త్ చదువుకున్న కావ్యజనని కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ సాయాన్ని సుందర్‌రాజన్ అందజేసి అండగా నిలిచారు.



టాపర్ కావ్యజనని

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మే 11: వేసవి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మూర్-వేలాంకన్ని, తాంబరం-కొచ్చువెల్లిలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06037 చెన్నై ఎగ్మూర్-వేలాంకన్ని ప్రత్యేక రైలు ఈ నెల 17,19,24,26,31, జూన్ 2,7,9,14,16,21,23,28,30 తేదీల్లో చెన్నై ఎగ్మూర్‌లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు వేలాంకన్ని చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06038 వేలాంకన్ని-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 18,20,25,27, జూన్ 1,3,8,10,15,17,22,24,29, జూలై 1 తేదీల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు వేలాంకన్నిలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.
- నెం.06035 తాంబరం-కొచ్చువెల్లి వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 16,18,23,25,30, జూన్ 1,6,8,13,15,20,22,27,29 తేదీల్లో తాంబరం నుంచి రాత్రి 9.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.40 గంటలకు కొచ్చువెల్లి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06036 కొచ్చువెల్లి-తాంబరం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 17,19,24,26,31, జూన్ 2,7,9,14,16,21,23,28,30 తేదీల్లో మధ్యాహ్నం 3.35 గంటలకు కొచ్చువెల్లిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

మంచినీటి కోసం మహిళల రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన ప్రజలు

పెరంబూర్, మే 11: కడలూరు జిల్లా పేరాంగియం గ్రామప్రజలు తాగునీరందించాలని కోరుతూ రాస్తారోకో చేపట్టారు. ఈ గ్రామానికి పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేస్తుంటారు. కొద్దిరోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేదని గ్రామస్తులు, అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ, వారి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు, ఖాళీ బిందెలతో కడలూరు-తిరుచ్చి జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులతో అక్కడకు చేరుకున్న పోలీసులు, ప్రజలతో చర్చలు జరిపి తాగునీటి సరఫరాకు సత్వర చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

అకాలవర్షం... తడిసిన ధాన్యం



కొనుగోలు కేంద్రంలో ఉంచిన ధాన్యం బస్తాలు

పెరంబూర్, మే 11: స్థానిక మరమలైనగర్ సమీపం కరునీలం పంచాయతీలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రాంగణంలో ఉంచిన ధాన్యం బస్తాలు వర్షాలకు తడుస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రానికి పరిసర గ్రామాల రైతులు ధాన్యం తీసుకొస్తుంటారు. బస్తాలు తీసుకొచ్చిన సమయంలో వాటిని తూకం వేసి గోదాములకు తరలించాల్సి ఉండగా కేంద్రం అధికారులు వెంటనే చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రకారం, రైతులు తీసుకొచ్చిన ధాన్యం బస్తాలు ప్రస్తుతం కేంద్రం ఆరుబయట ఉన్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం బస్తాలు తడుస్తున్నాయని, అధికారులు సత్వరం స్పందించని పక్షంలో తాము తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

మాజీ కలెక్టర్ గంగప్పకు జలకంఠేశ్వ ఆలయంలో మోక్షదీపం



మోక్షదీపం వెలిగిస్తున్న దృశ్యం

వేలూరు, మే 11: వేలూరు జిల్లా మాజీ కలెక్టర్లలో ఒకరైన డి.గంగప్ప ఈ నెల 9వ తేది బెంగుళూరులోని తన ఇంట్లో మృతిచెందారు. ఆయన ఆత్మశాంతి కోసం జలకంఠేశ్వరాలయంలో మోక్షదీపం వెలిగించారు. ఆలయ సెక్రటరీ సురేష్, ఆలయ ప్రధాన శివాచార్యులు మోక్షదీపం వెలిగించారు. అనంతరం తిరువాచకం ఆలపించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

తేలికపాటి వర్షానికి కూలిన రెండంతస్థుల భవనం



కూలిన కొత్త భవనం

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా బుల్లా కోట్టై రోడ్డు ప్రాంతంలో సుందర పాండ్యన్‌కు చెందిన రెండంతస్థుల భవనం కూలిపడింది. సుందర పాండ్యన్ 1988లో నిర్మించుకున్న ఇంటిలో నివాసముంటున్నారు. ఆ ఇంటి పాత పునాదులపైనే రెండంతస్థుల భవనం నిర్మించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆ ప్రాంతంలో పావుగంటసేపు కురిసిన తేలికపాటి వర్షానికి ఆ రెండంతస్థుల భవనం హఠాత్తుగా కుప్పకూలిపడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ప్రభుత్వ బస్సుపై కూలిన చెట్టు



పెరంబూర్, మే 11: సేలం జిల్లాలో రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఈదురుగాలుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో, సేలం నుంచి మేట్టూరు మార్గంలో మాదేశ్వరన్ కొండకు శనివారం మధ్యాహ్నం 17మంది ప్రయాణికులతో ప్రభుత్వ బస్సు బయల్దేరింది. మేట్టూరు రైల్వేస్టేషన్ బస్టాండ్‌లో ఆగిన బస్సు నుంచి ప్రయాణికులు కిందకు దిగుతున్నారు.ఆసమయంలో బ స్టాండ్ సమీపంలో రోడ్డుపై ఉన్న భారీ వేపచెట్టు హఠాత్తుగా కూకటి వేళ్లతో ప్రభుత్వ బస్సుపై పడిం ది. ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికులు, కండక్టర్, డ్రైవర్ ఎలాంటి గాయాలు లేకుండా తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీసు, రహదారులు, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది యంత్రాలతో చెట్టు కొమ్మలు తొలగించారు. ఈ కారణంగా సేలం-మేట్టూరు జాతీయ రహదారిలో సుమారు రెండు గంటలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

తిరుచ్చిలో కుంభవృష్టి...

అడయార్: తిరుచ్చిలో శనివారం ఉదయం జోరున వర్షం కురిసింది. దీంతో తిరుచ్చి వాసులు సంతోషం వ్యక్తం చేశారు. తిరుచ్చి పట్టణంలో గత రెండు నెలలుగా ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో పగటిపూట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే, గత రెండువారాలుగా వేడిగాలుల ప్రభావం కూడా అధికంగా ఉంది. దీంతో పగటిపూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయంతో వణికిపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి తిరుచ్చి నగరంలో ఆకాశం మేఘావృతమై కనిపించింది. ఆ తర్వాత సాయంత్రం 4 గంటల సమయంలో ఉన్నట్టుండి వర్షం కురిసింది. తర్వాత అర్ధరాత్రి నుంచి తేలికపాటి జల్లుతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు దాదాపు 600 ఎకరాల్లోని అరటి సాగు నేలకూలింది.

ముగ్గురుని బలితీసుకున్న వివాహేతర సంబంధం

- పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న తండ్రి
- వెస్ట్ మాంబాళంలో దారుణం



ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య చేసుకున్న మోహన్ (ఫైల్‌ఫొటో)

అడయార్, మే 11: భార్య వివాహేతర సంబంధాన్ని జీర్ణించుకోలేని భర్త తన ఇద్దరు పిల్లలను కడతేర్చి ఆత్మహత్య చేసుకున్న విషాదక ఘటన శనివారం నగరంలో చోటుచేసుకుంది. వెస్ట్ మాంబాళం కృష్ణప్ప నాయకర్ వీధికి చెందిన మోహన్ (55) పాత ఇనుప వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు భార్య యమున, సాయి స్వాతి (13), తేజర్ (5) అనే ఇద్దరు పిల్లలున్నారు. యమున ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నారు. ఆమె శుక్రవారం ఎప్పటిలాగే పనికి వెళ్ళగా, మోహన్ తన ఇద్దరు పిల్లలతో ఇంటిలోనే ఉన్నారు. అయితే, తన భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందన్న విషయం తెలుసుకుని ఆమెను పలుమార్లు మందలించాడు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన మోహన్.. తన ఇద్దరు పిల్లలను గొంతుకోసి , ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన యమున.. తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా లోపల గడియపెట్టి ఉండటంతో ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు తెరిచి ఇంట్లోకి వెళ్ళి చూడగా తన ఇద్దరు పిల్లలు రక్తపు మడుగులోనూ భర్త ఉరి వేసుకునికి వేలాడుతుండటాన్ని చూసి విలపిస్తూ కుప్పకూలిపోయింది. ఈ ఘటనపై స్థానికులిచ్చిన సమాచారం మేరకు కుమరన్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి... మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ అముద జరిపిన ప్రాథమిక విచారణలో.. భార్య పరాయి పురుషుడితో అక్రమ సంబంధం పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేక మోహన్... కొన్ని నెలల పాటు భార్యకు దూరంగా ఉన్నాడు. తర్వాత ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళింది. పోలీసులు దంపతులను కలపడంతో రెండు నెలలుగా వెస్ట్ మాంబాళంలో ఉంటున్నారు. అయితే, తప్పుదారిలో నడిచిన భార్యతో కలిసి జీవించడం ఇష్టంలేని భర్త మోహన్ తన ఇద్దరు పిల్లలను చంపి తాను కూడా ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

మదురైలో విషాదం....

కుమారుడి ఎదుటే కన్నుమూసిన దంపతులు

- విద్యుదాఘాతానికి దంపతుల మృతి



మృతులు మురుగేశన్-పాపాత్తి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మే 11: మదురైలో తెగిపడిన విద్యుత్ తీగపై ద్విచక్రవాహనం తగలడంతో దానిపై ప్రయాణిస్తున్న దంపతులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ద్విచక్రవాహనం ముందు సైకిల్‌పై వెళుతున్న 12 ఏళ్ల కుమారుడి కళ్ల ముందే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం చుట్టుపక్కల వారిని కంటతడి పెట్టించింది. మదురై కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం రాత్రంతా కురుస్తూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. మదురై టీవీఎస్ నగర్ దురైస్వామి రోడ్డు ప్రాంతానికి చెందిన మురుగేశన్ (50)పాపాత్తి (44) దంపతులు తాము నిర్వహిస్తున్న పండ్ల దుకాణం మూసివేసి బైక్‌లో ఇంటికి ప్రయాణమయ్యారు. తమ కుమారుడు సైకిల్‌పై ముందు వెళ్తుండగా వెనుకగా వీరు బైక్‌పై వెళుతున్నారు. వారు వెళ్తున్న మార్గంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురువడంతో విద్యుత్ తీగ తెగిపడింది. ముందు వెళ్తున్న కుమారుడు తెగిపడిన వైరు గమనించి తల్లిదండ్రులను హెచ్చరించేందుకు కొద్ది దూరం వెళ్లి ఆగి వెనక్కి తిరిగిచూశాడు. అప్పటికే దంపతులు ప్రయాణిస్తున్న బైక్ విద్యుత్ తీగకు తగలడంతో వారిద్దరు విద్యుదాఘాతంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. కళ్ల ముందే తల్లిదండ్రులు మృతిచెందడంతో బాలుడి వేదన చుట్టుపక్కల వారిని కలిచివేసింది. సమాచారం అందుకున్న సుబ్రమణ్యపురం పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పిడుగుపాటుకు ఇద్దరు మహిళల మృతి

పెరంబూర్, మే 11: తిరుచ్చి జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతిచెందారు. సోమరసంపేట సమీపంలోని అరటి తోటలో అదే గ్రామానికి చెందిన సెల్వి (48), రాధిక (44) పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆ ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. గాలుల ధాటికి ఈ తోట మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగ తెగిపడింది. శనివారం ఉదయం పనికి వచ్చిన సెల్వి, రాధిక తీగ గమనించకుండా దానిపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నాలుగు గ్రామాల ప్రజల ఆందోళన



ఆందోళనలో ప్రజలు

వేలూరు, మే 11: గుడియాత్తం సమీపం ఉల్లి పంచాయతీ పరిధిలోని పట్టువాపట్టి, వేలాయుధంపట్టి, జ్ఞానమేడు, మాధమ్‌పట్టు గ్రామాలకు రెండు నెలలుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం ఆ ప్రాంతాల ప్రజలు ఖాళీ బిందెలతో గుడియాత్తం-మాధనూరు మార్గంలో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న గుడియాత్తం పోలీసులు అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి నీరందించేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

235 పాఠశాల వాహనాల తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 11: జిల్లాలోని గుడియాత్తం ప్రాంతానికి చెందిన 35 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 235 వాహనాల తనిఖీ శనివారం జరిగింది. ప్రైవేటు విద్యా సంస్థలో గుడియాత్తం తహసీల్దార్ సుబ్బులక్ష్మి తనిఖీలు చేశారు. వాహనాల్లో ఎమర్జీన్సీ డోరు, సీసీ కెమెరా, వాహనం మెట్లు తదితరాలు పరిశీలించారు. ఈ తనిఖీల్లో 10కి పైగా వాహనాల్లో చిన్న లోపాలను గుర్తించిన అధికారులు, వాటిని సవరించి తీసుకురావాలని సూచించారు. అలాగే, డ్రైవర్ల కంటిచూపు పరీక్ష నిర్వహించారు. తనిఖీల్లో జిల్లా మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ రాజేష్‌ఖన్నా, నగర సీఐ పార్థసారథి, ట్రాన్స్‌పోర్ట్ ఎస్‌ఐ సెంథిల్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో తమిళనాడు మంత్రి గణేషన్



తిరుమల, మే11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కార్మిక సంక్షేమ శాఖా మంత్రి సీవీ. గణేషన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్ అరెస్టు



ఫెలిక్స్ జెరాల్డ్

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులను, పోలీసు ఉన్నతాధికారులను కించపరిచేలా విమర్శలు చేసి అరెస్టయిన సవుక్కు శంకర్ అనుచరుడు ఫెలిక్స్ జెరాల్డ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సవుక్కు శంకర్‌ను ఇంటర్వ్యూ చేసిన నేరానికిగాను ఫెలిక్స్ జెరాల్డ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సవుక్కు శంకర్‌పై ప్రస్తుతం గంజాయి స్మగ్లింగ్ కేసు కూడా ఉంది. అదే సమయంలో శంకర్ బెయిలు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జైలులో తనను పోలీసులు చితక కొడుతున్నారని కూడా ఆయన ఆరోపించారు.

రంగనాథస్వామి ఆలయంలో
వైభవంగా రథోత్సవం


రథోత్సవంలో నిర్వాహకులు హరికుమార్, శివప్రకాశం తదితరులు

ప్యారీస్, మే 11: స్థానిక పార్క్ టౌన్ ముల్లా వీధిలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి ఆలయంలో భగవత్ రామానుజుల అవతార దినోత్సవం సందర్భంగా శనివారం రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. ఈ ఆలయంలో ఈ నెల 3వ తేది నుంచి 13వ తేది వరకు చిత్తిరై ఉత్సవాలు, రామానుజుల అవతార వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో పూజలను లాంచనంగా ప్రారంభించారు. ఉదయం 7 గంటలకు మహా మండపంలో కొలువుదీర్చిన ఉత్సవమూర్తులకు విశేష పూజల అనంతరం రథం ప్రవేశద్వారం నుంచి కదిలింది. ఈ వేడుకల్లో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జె.హరికుమార్, కార్యనిర్వాహణాధికారి అచ్చి శివప్రకాశం, ధర్మకర్తలు ఇ.కిషోర్, గాయత్రి, అమరా జయకుమార్, తిలగవతి తదితరులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం 6 నుంచి శ్రీరామ పట్టాభిషేకం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గాంధీ మండపానికి
రూ.6.2 కోట్లతో మరమ్మతులు



ప్యారీస్, మే 11: స్థానిక గిండిలో ఉన్న గాంధీ మండపానికి రూ.6.2 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నట్లు రాష్ట్రప్రభుత్వం శనివారం ప్రకటించింది. గిండి సర్దార్ పటేల్ రోడ్డులో 18 ఎకరాల విస్తీర్ణంలో గాంధీ మండపం ఉంది. 1956 జనవరి 27న అప్పటి ముఖ్యమంత్రి రాజాజీ ఈ మండపాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ మండపం ప్రాంగణంలో మాజీ ముఖ్యమంత్రులు కామరాజర్, భక్తవత్సలం, స్వాతంత్ర్య సమరయోధులు వీఓ. చిదంబరం పిళ్లై, పండిత అయోధ్యదాసర్, రెట్టమలై శ్రీనివాసన్ సహా 12 మందికి పైగా సమరయోధుల స్మారక మందిరాలున్నాయి. ఈ మండపాన్ని పర్యవేక్షించడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని, అందువలన శిధిలావస్థకు చేరుకుందని ఇటీవల ఈ మండపాన్ని సందర్శించిన తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆరోపించారు. దీనిపై స్పందించిన రాష్ట్రప్రభుత్వం గాంధీ మండపానికి మరమ్మతుల కోసం రూ.6.2 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ నిధుల నుంచి రూ.20 లక్షలతో తాగునీటి సదుపాయం, రూ. కోటితో కాలిబాట, నీటి మోటార్లకు రూ.30తో మరమ్మతులు, ముళ్లపొదలు, చెత్త తొలగింపుకు రూ.5 లక్షలు, పెయింటింగ్‌కు రూ.20 లక్షలు, కృత్రిమ పచ్చికబయళ్లకు రూ.20 లక్షలు, మరో రూ.2 కోట్లతో విద్యుద్దీపాలు, రూ.50 లక్షలతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

కౌమారియమ్మన్ ఆలయ వేడుకల్లో
మొక్కుబడులు తీర్చుకున్న హిజ్రాలు




నోటికి శూలాలు గుచ్చుకుని అగ్నికలశాలతో ఊరేగింపులో పాల్గొన్న హిజ్రాలు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): తేని సమీపంలో సుప్రసిద్ధ వీర పాండి కౌమారియమ్మన్ ఆలయ చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 7న అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల సందర్భంగా రోజూ వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలలో కీలకఘట్టమైన రథోత్సవం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలలో వందల సంఖ్యలో హిజ్రాలు అగ్నికలశాలు పట్టుకుని నోటికి శూలాలు గుచ్చుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

తిరుత్తణిలో
ఘనంగా క్షీర కలశాల ఊరేగింపు


క్షీర కలశాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

ఐసిఎఫ్, మే 11: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి తాలూకా తిరువలంగాడు పంచాయతీలో ఉన్న మందవెళ్లి అమ్మన్, గంగైయమ్మన్ ఆలయ జాతర పురస్కరించుకొని క్షీర కలశాల ఊరేగింపు శనివారం ఘనంగా జరిగింది. ఈ ఆలయ ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారి కంకణధారణ చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఢమరుక ధ్వనులతో క్షీర కలశాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం ఆ పాలతో అమ్మవారికి అభిషేకం చేసి దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధం

- చేతులు లేకపోయినా డ్రైవింగ్ లైసెన్స్ ● రాష్ట్రంలోనే మొదటి వ్యక్తి
- తాన్సేన్ మనోధైర్యానికి పలువురి ప్రశంస


SUNDAY SPECIAL


కాళ్లతో కారు నడుపుతున్న తాన్సేన్

వైకల్యం అనేది కేవలం శరీరానికే కాని, మనసుకు కాదని నిరూపించాడీ యువకుడు. తన ఆత్మవిశ్వాసం ముందు విధి కూడా ఓడిపోయేలా చేశాడు. ప్రమాదంలో చేతులు కోల్పోయినా, ఆత్మవిశ్వాసంతో కాళ్లతో డ్రైవింగ్ నేర్చుకొని, డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందాడు వ్యాసర్పాడి పెరియాన్ నగర్‌కు చెందిన తాన్సేన్. శారీరకంగా కఠిన సవాళ్ల మధ్య రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మొదటి వ్యక్తిగా... ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన ఆ యువకుడి విజయ గాథ నేటి సండే స్పెషల్....

- పెరంబూర్

తాన్సేన్‌కు వివాహమై ఏడాదిన్నర పాప ఉంది. అతను, పదేళ్ల వయస్సులో ఉన్నప్పుడే విద్యుత్ ప్రమాదానికి గురై చేతులు కోల్పోయాడు. మోచేతుల కింది వరకు తీసేసినప్పటికీ ఆత్మవిశ్వాసంతో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. అనంతరం బీఎల్ పూర్తిచేసి, ప్రస్తుతం ఎంఎల్ చదువుతున్నాడు. అవయవాల్లో లోపం ఉన్నా, మనస్సును దృఢంగా చేసుకొని, అన్ని విషయాల్లో రాణించాలనే ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాడు. ఆ క్రమంలోనే, చేతులు లేకుండా డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకున్న అతను, డ్రైవింగ్ పరీక్షలో విజయం సాధించాడు. అతనికి పారిశ్రామికవేత్త శ్రీవారి శంకర్, నటుడు రాఘవ లారెన్స్ సహాయం చేశారు.



డ్రైవింగ్ లైసెన్స్ కోసం..

తనకు డ్రైవింగ్ లైసెన్స్ కావాలని తాన్సేన్ ఆర్టీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అతడి ప్రత్యేక పరిస్థితుల కారణంగా అధికారులు, కేకే నగర్‌లోని రీ హాబిలిటేషన్ కేంద్రానికి వెళ్లి వైద్యుల నుంచి సిఫారసు లేఖ తీసుకురావాలని సూచించారు. ఆ ప్రకారం ఆ కేంద్రానికి వెళ్లిన తాన్సేన్, వైద్య శాఖ డైరెక్టర్ డా.తిరునావుక్కరసు, డా.వలవన్, అబ్దుల్ తదితరుల సూచనలతో కారులో కొన్ని మార్పులు చేపట్టాడు. ఆ ప్రకారం, ఆటోమేటిక్ గేర్లు, సిగ్నల్, లైట్లు వేసే బటన్లు సీటు సమీపంలో పెట్టడం తదితరాలు సూచించడంతో పాటు వాటిని వినియోగించడంపై శిక్షణ ఇచ్చారు. ఆ ప్రకారం, కారులో మార్పులు చేపట్టిన తాన్సేన్, రెట్టేరి ఆర్టీవో కార్యాలయం నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందాడు. శారీరకంగా కఠిన సవాళ్ల మధ్య డ్రైవింగ్ లైసెన్స్ పొందిన దేశంలో మూడో వ్యక్తిగా, రాష్ట్రంలో మొదటి వ్యక్తిగా తాన్సేన్ నిలిచారు.

మూడు నెలల పర్యవేక్షణ...

ఈ విషయమై రీ హాబిలిటేషన్ వైద్యులు డా.తిరునావుక్కరసు మాట్లాడుతూ... కాళ్ల సహాయంతో అతను కారు నడపడం చూసి మొదట ఆశ్చర్యపోయామన్నారు. అదే సమయంలో, తగిన భద్రతాఅంశాలు కూడా అతను పాటించాల్సి ఉందన్నారు. మోకాళ్ల మీద పూర్తిగా ఆధారపడి కారు 'స్టీరింగ్' నడిపే సమయంలో అతడి అదుపులో వాహనం ఉందా అని పరిశీలించామని తెలిపారు. అలాగే, కారుకు ఆటోమేటివ్ డోర్లు, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, అత్యవసర సమయాల్లో బ్రేక్ వేయడం, హారన్ కొట్టడం తదితరాలపై మూడు నెలలు పర్యవేక్షించడంతో పాటు వాటిలో కొన్ని మెళకువలు నేర్పామన్నారు. అలాగే, కారులో కొన్ని మార్పులు చేపట్టాలని సూచించగా, తాన్సేన్ వాటిని పాటించడం గమనించి, డ్రైవింగ్ లైసెన్స్ మంజూరుకు సిఫారసు చేశామని తెలిపారు.

ఆధారపడడం ఇష్టం లేదు: తాన్సేన్

ప్రతి విషయంలో ఒకరిపై ఆధారపడడం తనకు ఇష్టం లేదన్నారు. అందువల్లే, స్వతహాగా తన అవసరాలను పూర్తిచేసుకొనేలా అలవాటు చేసుకున్నానని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లోనే కారు డ్రైవింగ్ లైసెన్స్ పొందానన్నారు. తన శిక్షణకు పలువురు చేయూతనందించారన్నారు. ఇటీవల తిరుమల కొండ మార్గంలోనూ తానే కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లానని తెలిపారు. తనకు చేయూతనందించిన నటుడు రాఘవ లారెన్స్, శ్రీవారి శంకర్, వైద్యులు, ఆర్టీవో అధికారులకు తాన్సేన్ కృతజ్ఞతలు తెలిపారు.


'బుజ్జి ఎట్ అనుపట్టి' చిత్రంలో బేబి ప్రణతి

బాలల చిత్రంగా 'బుజ్జి ఎట్ అనుపట్టి'

బాలలోకాన్ని వెండితెరపై చూపించే చిత్రంగా 'బుజ్జి ఎట్ అనుపట్టి' రూపుదిద్దుకుంది. ఈ మూవీని త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సాధారణంగా హాలీవుడ్‌లో చిన్నారుల కోసం రూపొందించిన అనేక చిత్రాలు ఎంతగానో ఆదరణ పొందాయి. కానీ, భారతీయ చిత్రపరిశ్రమలో చిన్నారుల కోసం నిర్మించిన చిత్రాలు పెద్దగా ఆదరణకు నోచుకున్న సందర్భాలు చాలా అరుదు. ఈ నేపథ్యంలో 'బుజ్జి ఎట్ అనుపట్టి' చిత్రాన్ని కిడ్స్ వరల్డ్ మూవీగా తెరకెక్కించారు. కమల్ కుమార్, నక్సలైట్ వైదీశ్వరి, కార్తీక్ విజయ్, బేబీ ప్రణతి శివ శంకరన్, లావణ్యా కన్మణి, నక్సలైట్ రామ్ కుమార్, మీనా తదితరులు నటించారు. ఈ చిత్రం గురించి దర్శకుడు కందస్వామి మాట్లాడుతూ, 'బాల ప్రపంచం ఎంతో అందంగా ఉంటుంది. ఆ బాల ప్రపంచంలోకి ఒకసారి మనం వెళితే, ఆ ప్రపంచం మనకు కూడా ఎంతో అందంగా మారిపోతుంది. అలాంటి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమా చూసిన తర్వాత ఖచ్చితంగా భావాల్లో మార్పు వస్తుంది. ఒక ప్రాణి కోసం మరో ప్రాణి చేసే ప్రయాణం. ఈ రెండు జీవాల ప్రయాణాన్ని ప్రధాన కథాంశంగా చేసుకుని తెరకెక్కించాం. కేవలం చిన్నారులు మాత్రమే కాదు... ప్రతి ఒక్కరూ చూడదగిన చిత్రం' అని పేర్కొన్నారు. 9వి స్టూడియోస్ బ్యానరుపై తెరకెక్కించిన ఈ చిత్రానికి కార్తీక్ రాజా సంగీతం' అని దర్శకుడు వివరించారు.

నెలాఖరులో సూరి 'గరుడన్' విడుదల


'గరుడన్'లో ఓ దృశ్యం

హాస్య నటుడు సూరి ప్రధాన పాత్రలో నటించిన 'గరుడన్' ఈ నెలాఖరులో విడుదల చేయనున్నట్టు ఓ పోస్టర్ ద్వారా ప్రకటించారు. 'విడుదలై' చిత్రం తర్వాత సూరి పలు చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. ఈ క్రమంలో సూరి హీరోగా నటించి, భారీ అంచనాలు ఉన్న చిత్రంగా 'గరుడన్' నిలిచింది. ఇందులో మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ ప్రతినాయకుడిగా నటించగా, సీనియర్ నటుడు శశికుమార్, సముద్రఖని ప్రధాన పాత్రలు పోషించారు. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ కథ సమకూర్చగా, కె.కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి దురై సెందిల్ కుమార్ దర్శకత్వం వహించారు. యాక్షన్ మూవీగా రూపొందించిన ఈ చిత్రాన్ని ఈ నెలలో విడుదల చేయనున్నారు. అయితే, విడుదల తేదీపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. లార్క్ స్టూడియోస్, గ్రాస్‌రూట్ ఫిల్మ్ కంపెనీ సంయుక్తంగా నిర్మించగా, యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు.

మళ్లీ విదేశాలకు వెళ్ళిన విజయ్


చెన్నై ఎయిర్‌పోర్టులో విజయ్

అగ్రహీరో విజయ్ మళ్లీ విదేశాలకు వెళ్లారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్' (గోట్స్) చిత్రం కోసం ఆయన విదేశాలకు వెళ్లినట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఆయన శనివారం చెన్నై విమానాశ్రయంలో కనిపించారు. తమ అభిమాన నటుడిని చూసిన అభిమానులు.. నినాదాలు చేస్తూ, హ్యాపీ జర్నీ అంటూ విషెస్ చెప్పారు. 'లియో' చిత్రం తర్వాత విజయ్ నటించే 68వ చిత్రాన్ని ఏజీఎస్ నిర్మాణ సంస్థ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న విషయం తెల్సిందే. ఇందులో జయరాం, ప్రభుదేవా, మోహన్, ప్రశాంత్, వైభవ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు నటిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చుతున్న ఈ చిత్రం చిత్రీకరణ పుదుచ్చేరి, కేరళ, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల సహా మరికొంత భాగాన్ని విదేశాల్లో షూట్ చేశారు. ఇటీవలే రష్యా షెడ్యూల్ పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చిన విజయ్.. ఇపుడు మళ్లీ విదేశాలకు వెళ్ళారు. ఈ మూవీని సెప్టెంబరు 5వ తేదీ విడుదల చేయనున్నట్టు ప్రకటించిన విషయం తెల్సిందే.

చిత్రజ్యోతి

పారితోషికం పెంచిన అనుపమ

వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తన రెమ్యునరేషన్ ఒక్కసారిగా పెంచేసింది.. గతంలో కోటి నుంచి కోటిన్నర వరకు రెమ్యునరేషన్ తీసుకునే ఆమె... ఇపుడు రూ.రెండు కోట్లకు పెంచినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 'ప్రేమమ్' సినిమాతో మలయాళంలో తొలిసారి అడుగుపెట్టిన ఈమె ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ పరిశ్రమల్లో అనేక చిత్రాల్లో నటించింది. తమిళంలో ధనుష్, అధర్వ, జయం రవి వంటి పలువురు హీరోల సరసన నటించిన అనుపమ ప్రస్తుతం మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధృవ్ విక్రమ్ హీరోగా తెరకెక్కే చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే, తెలుగులో కూడా పలు చిత్రాలకు కమిట్ అవడమే కాకుండా మాతృభాష మలయాళంలో కూడా ఆమె బిజీగా ఉంది. ఇలా మూడు భాషల్లో బిజీగా ఉండటంతో తన రెమ్యునరేషన్‌ను పెంచేశారని చిత్రపరిశ్రమ వర్గాల సమాచారం.


అనుపమ పరమేశ్వరన్



కెప్టెన్ సంస్మరణ స్థలంపై పద్మభూషణ్ అవార్డు

- ప్రేమలత నివాళులు

ప్యారీస్, మే 11: స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని ఆ పార్టీ వ్యవస్థాపకుడు దివంగత విజయకాంత్ సంస్మరణ స్థలంలో ఆయనకు కేంద్ర ప్రభుత్వం అందించిన పద్మభూషణ్ అవార్డుతో ప్రేమలత శనివారం నివాళులర్పించారు.

దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9వ తేదీన పద్మ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కేంద్ర ప్రభుత్వం విజయకాంత్‌కు ప్రకటించిన పద్మభూషణ్ అవార్డును ఆయన సతీమణి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డుతో నగరానికి తిరిగొచ్చిన ప్రేమలత పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలతో కలసి కెప్టెన్ సమాధి వద్ద పూలుచల్లి నివాళులర్పించారు.

విజయకాంత్ సమాధిపై పద్మభూషణ్ అవార్డు ఉంచి నివాళులర్పిస్తున్న ప్రేమలత, పార్టీ ప్రముఖులు

మెరీనా తీరంలో 'సెయిలింగ్ అకాడమీ' ఏర్పాటు

- రాష్ట్రప్రభుత్వ నిర్ణయం



పెరంబూర్, మే 11: స్థానిక మెరీనా సముద్రతీరంలో తెరచాపల పడవల (సెయిలింగ్) అకాడమీ ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం కూవం నది ముఖద్వారంలో రూ.7 కోట్లతో 2.75 ఎకరాల్లో అకాడమీ ఏర్పాటుకానుంది. అకాడమీ కార్యాలయం కింది అంతస్తులో శిక్షణ రూమ్, వీడియో లైబ్రరీ, రిసెప్షన్ హాల్, కోచ్‌ల రూమ్, కార్యాలయం, పడవలు నిలిపే స్థలం, స్విమ్మింగ్ పూల్ తదితరాలు ఏర్పాటుకానున్నాయి. మొదటి అంతస్తులో ఓపెన్ ఎయిర్ క్లాస్ రూమ్, యోగా రూమ్, లైబరీ , జిమ్, స్పోర్ట్స్ సైన్స్ ట్రైనింగ్ రూమ్ తదితరాలుంటాయి. ఈ ప్రాజెక్ట్‌ను 2016లో ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత శాసనసభలో 110వ నిబంధన కింద ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం చేసినా సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో, తెరచాపల పడవ క్రీడను ప్రోత్సహించే ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ అనుమతి కోరుతూ రాష్ట్ర క్రీడాభివృద్ధి సమాఖ్య దరఖాస్తు చేసుకుంది. అనుమతి వచ్చిన వెంటనే ప్రాజెక్ట్ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

కళలేని మురుగన్ విగ్రహం: భక్తుల ఆగ్రహం


తారామంగళం ఆలయం వద్ద ప్రతిష్ఠించిన మురుగన్ విగ్రహం

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా తారామంగళం సమీపంలోని రాజమురుగన్ ఆలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన 56 అడుగుల మురుగన్ విగ్రహం వివాదాస్పదంగా మారింది. భక్తులకు ధైర్యం కలిగించేలా శూలాయుధంతో వీరత్వాన్ని చాటిచెప్పేలా ఉండాల్సిన మురుగన్ విగ్రహం కాస్తా విషణ్ణవదనంతో ఉండేలా ఏర్పాటు చేయడంతో భక్తులు ఆలయ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ మురుగన్ విగ్రహం ఫొటోలు, వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ మురుగన్ విగ్రహంలోని ముఖం, దేహం సక్రమంగా లేదంటూ నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఈ విషయమై విగ్రహాన్ని రూపొందించిన శిల్పిని ప్రశ్నించినప్పుడు తానిప్పటివరకూ మునీశ్వరుడి విగ్రహాలనే తయారు చేశానని, మురుగన్ విగ్రహాన్ని తయారు ఇదే మొదటిసారి అని తెలిపారు. ఇక వివాదాస్పదంగా మారిన ఆ విగ్రహాన్ని పునర్నిర్మిస్తామంటూ ఆలయ నిర్వాహకుడు వెంకటాచలం తెలిపారు. ఇప్పటి వరకూ ఈ మురుగన్ విగ్రహం తయారు చేయడానికి రూ.40లక్షలు ఖర్చుచేశామని, చివరకు అందవిహీనంగా ఉన్న విగ్రహాన్ని పునర్నిర్మిస్తామని ఆయన వివరించారు.

మాధవరం-ఎన్నూర్ మధ్య
మెట్రో మార్గం

- సాధ్యాసాధ్యాలపై నివేదిక ● సీఎంఆర్ఎల్


పెరంబూర్, మే 11: స్థానిక మాధవరం-ఎన్నూర్ మధ్య 16 కి.మీ కొత్త రైలు మార్గం సాధ్యాసాధ్యాలపై అధ్యయన నివేదిక రూపొందించాలని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) నిర్ణయించింది. నగరంలో తొలివిడతలో రెండు మార్గాల్లో 54 కి.మీ మేర మెట్రోరైళ్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే, రెండో విడత ప్రాజెక్ట్‌లో మాధవరం-షోలింగనల్లూర్, మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్, పూందమల్లి-లైట్ హౌస్ మార్గాల్లో 116 కి.మీ మేర చేపట్టిన నిర్మాణపనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. ఇక, రెండో మెట్రో ప్రాజెక్ట్‌లో మాధవరం-ఎన్నూర్ వరకు విస్తరించేలా కొత్త మార్గం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేయాలని సీఎంఆర్ఎల్ నిర్ణయించింది. రెండో విడతలో నగరంతో శివారు ప్రాంతం పూర్తిగా అనుసంధానం చేసేలా మెట్రోరైలు మార్గం ఏర్పాటవుతోంది. ఈ క్రమంలోనే మాధవరం-ఎన్నూర్ వరకు రెండోవిడత ప్రాజెక్ట్ విస్తరింపజేయాలని సీఎంఆర్ఎల్ చర్యలు చేపట్టింది.



జన కేతనం

జగనన్న పాలనలో టీటీడీని వ్యాపార కేంద్రంగా మార్చిన వైసీపీ

లడ్డు మొదలు కాటేజీల దాకా విపరీతంగా పెరిగిన ధరలు





మేల్‌చాట్ వస్త్రాన్ని రూ.50 కాదు రూ.లక్ష చేయండి. అభిషేకం, వస్త్రం టికెట్లు డబుల్ కాదు ట్రిబుల్ చేయండి. నన్ను అడిగితే ఫోర్‌టైమ్స్ పెంచినా ఇబ్బంది లేదు. సుప్రభాతం రూ.2 వేలు చేయండి. తోమాల, అర్చన సేవలను రూ.5 వేలు చేయండి, కల్యాణోత్సవం కూడా రూ.2,500 నుంచి రూ.3 వేలు చేయండి. వేదాశీర్వచనం కూడా రూ.10 వేలు చేయండి, ఏం కాదు"

తిరుపతి
ఆంధ్రజ్యోతి

మార్కెట్‌లో వేలంపాటలా విని పిస్తున్న ఈ మాటలు అన్నది సాక్షాత్తూ తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మన్. 2022 ఫిబ్రవరిలో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ధరలు పెంపుపై ప్రతిపాదనను ఈవో ధర్మారెడ్డి చదివి వినిపిస్తుండగా జోక్యం చేసుకున్న అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఉదారంగా అన్న మాటలు ఇవి. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తిరుమల ఆధ్యాత్మిక క్షేత్రాన్ని వ్యాపారనిలయంగా మార్చేసిన తీరుకు ఇదే సాక్ష్యం. జంబో పాలకమండలిని ప్రకటించి, కోర్టు మొట్టికాయలు తిన్న తీరు అందరికీ ఎరుకే. రాజకీయ పునరావస కేంద్రంగా, ఆదాయవనరుగా టీటీడీని మార్చేశారు. ఇబ్బడిముబ్బడిగా నాయకుల పీఆర్వోలు దళారీలుగా కొండమీద దర్శనాల మార్కెట్ నడుపుతుంటారనే ఆరోపణలు ఈ ఐదేళ్లు పెరిగిపోయాయి. ఈవో ధర్మారెడ్డి అయితే అధికారిగా కన్నా వైసీపీ నాయకుడిలా వ్యవహరిస్తుంటారనే విమర్శలు హోరెత్తాయి. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి రెండోసారి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నాక టీటీడీ నిధులను తిరుపతికి మళ్లించిన విధానం మీదా, ఆగమేఘాలపై రూ.1500 కోట్లకు పైగా పనులకు ఆమోదం తెలపడం మీదా ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. సాధారణ భక్తులను గాలికొదిలేసి వీఐపీలసేవలో టీటీడీ తరిస్తోంది. జగన్ గద్దెనెక్కక ముందూ, తర్వాతా టీటీడీ నిర్ణయాల్లో వచ్చిన మార్పులు.. ఎన్నికల వేళ జనంలో చర్చగా మారాయి. జగన్ బాదుడే బాదుడు కార్యక్రమాన్ని టీటీడీలోనూ కొనసాగించారు. అదెలాగో మీరే చూడండి...



భక్తులనూ బాదేశారు

వివాదాల శ్రీవాణి

శ్రీవాణి (శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు) పేరుతో వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పించే విధానాన్ని జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నవంబరు నుంచి ప్రారంభించారు. రోజుకు వెయ్యి నుంచి పదిహేను వందల టికెట్లు కేటాయిస్తారు. అంటే దాదాపు కోటిన్నర రూపాయలు ఈ ఒక్క దర్శనం టికెట్ల నుంచే టీటీడీకి లభిస్తోందన్నమాట. శ్రీవాణి పేరుతో గోల్‌మాల్ జరుగుతోందంటూ ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. విచిత్రంగా నిజనిర్ధారణ కమిటీ పేరుతో తిరుపతి ప్రెస్‌క్లబ్ ఈ ట్రస్టు నిధులు సద్వినియోగం అవుతున్నాయని ఒక సర్టిఫికెట్ ఇవ్వడం విశేషం.

చంద్రబాబు పాలనలో: వీఐపీ బ్రేక్ ధర. రూ. 500. రెండు లడ్డూలు ఉచితం.

జగన్ పాలనలో: వీఐపీ బ్రేక్ రూ.500. అయితే శ్రీవాణి భక్తులకు మాత్రం అదనంగా రూ.10,000. ఒక లడ్డూ ఉచితం.

లక్ష నుంచి కోటికి ఉదయాస్తమానసేవ

ఉదయాస్తమాన సేవ అని సుప్రభాతం నుంచీ రాత్రి ఏకాంతసేవ దాకా అన్ని సేవల్లోనూ ఒక్కరోజు పాల్గొనే అవకాశం ఉండేది. 1981లో ప్రారంభించిన ఈ ఆర్జిత సేవను 1995లో ఆపేసినా అధికారికంగా రద్దు చేస్తున్నట్టు 2006లో ప్రకటించారు. అయితే మిగిలిపోయిన 531 టికెట్లను 2022 ఫిబ్రవరిలో విడుదల చేశారు. ఆ ధరలు ఎంత పెంచారో చూడండి..

చంద్రబాబు పాలనలో: టికెట్ ధర రూ. లక్ష. శుక్రవారం మాత్రం రూ. 5లక్షలు.

జగన్ పాలనలో: ఒక టికెట్టు ధర రూ. కోటి. శుక్రవారం అయితే రూ. 1.5 కోట్లు.

కల్యాణోత్సవం

చంద్రబాబు పాలనలో: రూ.1000. ఉత్తరీయం, రవిక, ఒక పెద్దలడ్డూ, వడ ఉచితంగా ఇచ్చేవారు.

జగన్ పాలనలో: రూ.1000. అయితే ఉత్తరీయం, రవిక, పెద్దలడ్డూ, వడ రద్దు చేశారు. ఒక సాధారణ లడ్డూ మాత్రమే ఇస్తారు.



వేదాశీర్వచనం

చంద్రబాబు పాలనలో: రూ.1,500.

జగన్ పాలనలో: రూ. 3000.



లడ్డూ ధరలనూ పెంచేశారు

తిరుమల భక్తులు అత్యంత పవిత్రంగా భావించి తీసుకువెళ్లేది లడ్డూ. దర్శనం తర్వాత తమ ఊళ్లకు వెళ్లి బంధుమిత్రులకు లడ్డూ ప్రసాదం పంచుతారు. ఈ ధరలను కూడా జగన్ ప్రభుత్వం పెంచేసింది.

చంద్రబాబు పాలనలో: సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు రూ.10 ధరతో రెండు లడ్డూలు ఇచ్చేవారు. అదనపు లడ్డూలు కావాలంటే ఒక్కో లడ్డూ రూ.25 లెక్కన విక్రయించేవారు. అలాగే వీఐపీ బ్రేక్, రూ.300 దర్శనానికి వెళ్లేవారికి, ఆర్జితసేవలకు వెళ్లే భక్తులకు రెండు లడ్డూలు ఉచితంగా ఇచ్చేవారు. నడకమార్గంలో వెళ్లిన భక్తులకు ఒక లడ్డూ ఉచితంగా అందజేశారు. వడ ధర రూ.25. కళ్యాణం లడ్డూ ధర రూ.100, తిరుప్పావై సేవ జిలేబీ రూ.100 ఉండేది.

జగన్ పాలనలో: 2020 జనవరి 20 నుంచి టీటీడీ లడ్డూలపై సబ్సిడీని రద్దు చేశారు. దీనికి బదులుగా శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్కరికీ ఒక ఉచిత లడ్డూ ఇచ్చే విధానాన్ని ప్రారంభించారు. లడ్డూ ధరను రూ.25 నుంచి రూ.50కు పెంచారు. ఇతర అన్ని దర్శనాలకూ ఒక లడ్డూ మాత్రమే ఉచితం చేశారు. వడ ధర రూ100. కళ్యాణం లడ్డూ ధర రూ.200, తిరుప్పావై సేవ జిలేబీ రూ.500 చేసేశారు.

టోల్ వలిచేస్తున్నారు

తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో టోల్‌గేట్ల ధరలను కూడా భారీగా పెంచారు. దీని కోసం 2020లో టీటీడీ బోర్డు తీర్మానం కూడా చేసింది.

చంద్రబాబు పాలనలో: కారుకు రూ.15లు. ట్యాక్సీకి రూ.25. మిని లారీ, మినీ బస్సులకు రూ.50.

జగన్ పాలనలో: కారుకు, ట్యాక్సీకి రూ.50, మినిలారీ, మినీ బస్సులకు రూ.100.

లాడ్జీలతో పోటీ పడేలా కాటేజీల అద్దెలు

తిరుమలకు వచ్చే భక్తులకు వసతి కల్పించడం ఒక భాగ్యంగా టీటీడీ గతంలో భావించేది. వారికి సౌకర్యాల కోసం లాభనష్టాల లెక్కలు వేయకుండా ఎంతో వెచ్చించేది. జగన్ అధికారంలోకి వచ్చాక వసతి గదుల ధరలు దారుణంగా పెంచేశారు.

చంద్రబాబు పాలనలో: పాంచజన్య, కౌస్తుభంలోని గదులు రూ.500, నందకంలో రూ. 600 ఉండేది. ఏసీ గదులు రూ. 1000. నారాయణగిరి 1,2,3 సముదాయాల్లో రూ.150. నారాయణగిరి-4లో రూ.750. కార్నర్ గదులు. రూ. 200లుండేవి. స్పెషల్‌టైప్ కాటేజీల అద్దె రూ.200 ఉండేది. అందులోనే కార్నర్ సూట్ అద్దె రూ.1,500. వీవీజీహెచ్ విశ్రాంతి భవనాల్లో గది అద్దె రూ.1,500. సామాన్య భక్తులు బస చేసే గదుల అద్దె రూ.150, రూ.200.

జగన్ పాలనలో: పాంచజన్య, కౌస్తుభం, నందకం గదులు రూ.1000కి పెంచేశారు. ఏసీ గదులు రూ.1500. నారాయణగిరి 1,2,3 సముదాయాల్లో రూ.1700.నారాయణగిరి-4లో రూ.1700. కార్నర్ గదులను ఏకంగా రూ.2,200 చేశారు. స్పెషల్ టైప్ కాటేజీల అద్దె రూ.2,200కు పెంచారు. కార్నర్ సూట్ అద్దె రూ.2,600. వీవీజీహెచ్ విశ్రాంతి భవనాల్లో గది అద్దె రూ.2,220. సామాన్య భక్తులు బస చేసే గదుల అద్దె .1,500, రూ.2,200 చేశారు.



పేదలకు పెళ్లిమండపం దూరం

టీటీడీ కల్యాణమండపాల్లో పెళ్లి చేసుకోవడం అంటే శ్రీవారి సన్నిధిలో చేసుకున్నంత పవిత్రంగా భక్తులు భావిస్తారు. అందుకు తగ్గట్టే టీటీడీ వీటి అద్దెలు కూడా అందరికీ అందుబాటులో ఉండేవిధంగా నిర్ణయించేది. తిరుచానూరుకు సమీపంలో శ్రీనివాస కల్యాణమండపాలు నాలుగు, పద్మావతీ కల్యాణమండపాలు మూడు ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చాక పేదలకు ఇవి అందనంతగా ధరలు పెంచేశారు. మరమ్మతులు పేరుతో, ఏసీలు పెట్టామనే పేరుతో బాదేశారు.

చంద్రబాబు పాలనలో: శ్రీనివాస కల్యాణమండపంలో 1,2 మండపాల్లో అద్దె రూ.6,490. 3,4 మండపాల్లో రూ.7,640 ఉండేవి. పద్మావతి కల్యాణ మండపాల్లో కూడా రూ.7,640 మాత్రమే అద్దె వసూలు చేసేవారు.

జగన్ పాలనలో: శ్రీనివాసలో 1,2 మండపాల అద్దెను రూ.1.18 లక్షలు చేశారు. 3,4 మండపాల అద్దెను రూ.1.41 లక్షలు చేశారు. పద్మావతిలో అద్దె రూ.1.35 లక్షలు చేశారు.



తిరుచానూరులోనూ..

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోనూ ఆర్జితసేవల ధరలను అమాంతం పెంచేశారు. సుప్రభాతం రూ.25 నుంచి రూ.50 చేశారు. రూ.25లున్న సహస్రనామార్చన రూ.100 చేశారు. ఏకాంత సేవను రూ.25 నుంచి రూ.50కి పెంచారు. రూ.600 ఉన్న తిరుప్పావడసేవను రూ.వెయ్యికి పెంచారు. అభిషేకానంతర దర్శనం రూ.20 నుంచి రూ.250కి పెంచేశారు.

తిరుపతిలో ఏజెంట్లకు స్థలాభావం

● అందరినీ లోపల కూర్చోబెట్టలేం: కలెక్టర్ ● బోగస్ ఓట్లు వేస్తే జైలుకు పంపుతాం: ఎస్పీ



కలెక్టర్‌లోని వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్), మే 11: తిరుపతి అసెంబ్లీ బరిలో అత్యధికంగా 46మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అన్ని పార్టీల ఏజెంట్లు కూర్చోవడానికి స్థలాభావం ఉంటుంది. అందువల్ల జాతీయ పార్టీలు, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీల అభ్యర్థుల ఏజెంట్లను మాత్రమే కేంద్రంలో కూర్చోబెడతాం. మిగిలినవారు వెలుపల కూర్చొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికి అభ్యర్థులందరూ సహకరించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సోమవారం జిల్లాలోని 2,140 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు సజావుగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చంద్రగిరి, తిరుపతిలో వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. మిగిలిన నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మకమైన 1,401 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. 888 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. 964 మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తారు. బయటప్రాంతాల నుంచి ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేతలు జిల్లా వదిలి వెళ్లిపోవాలి. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఎన్నికల సిబ్బంది అడిగినప్పుడు దర్శన టికెట్లు చూపించి, సహకరించాలి. పోలింగ్ రోజు సాయంత్రం ఆరు గంటల వరకు ఎవరైతే క్యూలో ఉంటారో ఆఖరు వ్యక్తి వరకు ఓటు వేసేలా చూస్తాం. ఓటరు లిస్టులో పేరుండి స్లిప్ అందని వారు ఎపిక్ కార్డు లేదా ఎన్నికల కమిషన్ సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా తీసుకొచ్చి ఓటు వేయవచ్చు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను పద్మావతి మహిళా వర్సిటీ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తాం. ఫిర్యాదులుంటే 1950 టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర బలగాలతోపాటు ఐదువేలమంది రాష్ట్ర పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల నేతల మాటలు విని యువత బోగస్ ఓట్లు వేయడానికి ప్రయత్నించినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా 144 సెక్షన్


ప్రచారపర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. 18,12,980 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తిరుపతి పార్లమెంటుకు 23మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 133మంది బరిలో ఉన్నారు. పోలింగ్ విధుల్లో 14,769 మంది పీవో, ఏపీవోలు, సిబ్బంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం నుంచి పోలింగ్ ముగిసే సోమవారం సాయంత్రం మద్యం అమ్మకాలను నిషేధించారు. దీంతో బార్లు, మద్యం దుకాణాలు మూతపడ్డాయి.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలప్రతినిధులు, అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయంకల్లా సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో విధుల్లో హాజరు కావాలన్నారు. హాజరు కానివారికి క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర బలగాల నీడలో తిరుపతి ఎన్నికలు

తిరుపతి(నేరవిభాగం), మే 11: తిరుపతిలో వారం క్రితమే భారీ ఎత్తున బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలు ఎన్నికల విధుల్లో మోహరించాయి. తాజాగా తమిళనాడు నుంచి ఐదుగురు ఎస్ఐలు, దాదాపు 40 మంది పోలీసులు, వీరితో పాటు అప్పాలో శిక్షణ పొందుతున్న డీఎస్పీ రాజసింహ, శిక్షణ ఎస్ఐలను ఎన్నికల విధులకు రప్పించారు. అడ్డదారుల్లో బోగస్ ఓట్లు వేయడానికి వస్తే వీరు వెంటనే గుర్తించి అరెస్టు చేస్తారు. తొలిసారిగా తిరుపతి నియోజకవర్గాన్ని సమస్యాత్మకంగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించడంతో సీఆర్‌పీఎఫ్ బలగాల మధ్య ఎన్నికలు జరుగనున్నాయి.



గతంలో ఓటేసినా చాలామందికి ఈవీఎం అనగానే సందేహాలే. కొత్తవారికి మరీనూ. అందుకే ఓటు వేయకమునుపే వాటి గురించి ఒకసారి తెలుసుకుంటే మంచిది. సాధారణంగా పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు వుంటారు.

ఓటు వేయండిలా...

● బీప్ శబ్దం వస్తేనే ఓటేసినట్టు సుమా..

1 బూత్‌లోకి ప్రవేశించాక ఓటరు తీసుకువెళ్లే స్లిప్‌ను మొదటి అధికారి పరిశీలిస్తారు. ఏదో ఒక ఐడీ చూపించాక ఓటరు వివరాలను తన దగ్గర ఉన్న జాబితాతో సరిపోల్చుకుంటారు. ఆ కేంద్రంలో అక్కడే ఉన్న వివిధ పార్టీల ఏజెంట్లు కూడా ఆ ఓటరు పేరు, వరుస క్రమం చెక్ చేసుకుంటారు.

2 అప్పుడు ఓటరు పక్కనే ఉన్న రెండవ అధికారి వద్దకు వెళ్లాలి. సదరు అధికారి కూడా ఓటరు వివరాలను మరోసారి పరిశీలిస్తారు. ఓకే అని భావించాక ఆ ఓటరు నుంచి సంతకం తీసుకుంటారు. నిరక్షరాశ్య ఓటరైతే వేలిముద్ర తీసుకుంటారు. తర్వాత ఓటరు ఎడమచేతి చూపుడువేలి చివరిన సిరా గుర్తు పెడతారు.

3 సిరా ముద్ర వేశాక ఓటరు అక్కడ ఉండే మూడో అధకారి వద్దకు వెళ్లాలి. ఆ అధికారి కూడా ఓటరు వద్ద ఉన్న స్లిప్ వివరాలను చెక్ చేస్తారు. ఆయన తన దగ్గరున్న కంట్రోల్ యూనిట్ మీట నొక్కి ఓటు రిలీజ్ చేస్తారు. ఓటు రిలీజ్ చేయక ముందు కంట్రోల్ యూనిట్‌పై ఎడమ వైపు ఆకుపచ్చ రంగు ఎల్ఈడీ లైట్ వెలుగుతూ ఉంటుంది. ఓటు రిలీజ్ చేశాక కుడివైపు ఎరుపు రంగు లైట్ వెలుగుతుంది. దీనిని ఓటరు పరిశీలిస్తే మంచింది.

4 నాలుగోదశలో ఓటరు బ్యాలట్ యూనిట్ ఉన్నచోటకు వెళ్లాలి. ఆ యూనిట్‌పై అతికించిన బ్యాలట్ పేపరుపై అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. తనకు నచ్చిన అభ్యర్థి పేరు, గుర్తు ఉన్న మీట నొక్కాలి. వెంటనే దాని పక్కన బాణం గుర్తులో ఎర్రని లైట్ వెలుగుతుంది. వెంటనే బీప్ అనే శబ్దం వస్తుంది. తర్వాత బ్యాలట్ యూనిట్‌పై ఆకుపచ్చ రంగులైట్ ఆరిపోతుంది.

5 ఆ యూనిట్ దగ్గరలోనే వీవీప్యాట్ పరికరం నుంచి ఒక స్లిప్ కనిపిస్తుంది. ఓటు వేసిన అభ్యర్థి పేరు, గుర్తు కనిపిస్తాయి. ఇది కొద్ది క్షణాలపాటే కనిపిస్తుంది. ఓటరు తాను వేసిన ఓటు సదరు అభ్యర్థికి పడిందో లేదో తెలుసుకునేందుకు ఇదో అవకాశం.

● ఒకేసారి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు జరుగుతున్నందున రెండు బ్యాలట్ యూనిట్లు ఉంటాయి. ఇద్దరు అభ్యర్థులకు వేరువేరుగా ఓటు వేయాల్సి ఉంటుంది. కానీ ప్రక్రియ మాత్రం ఒకేలా ఉంటుంది.

● ఓటు మీట నొక్కిన తరువాత బీప్ అనే శబ్దం రాకపోతే ఓటు పడలేదని గమనించాలి. సందేహమొచ్చినా తేడా ఉన్నట్లు గుర్తించినా వెంటనే మాక్ పోల్ స్లిప్ ద్వారా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి.

ఓటరు గుర్తింపు కార్డులివే..



పోలింగ్ రోజున ప్రతి ఒక్కరు తమతో పాటు పోలింగ్ స్టేషన్‌కు విధిగా వ్యతిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి లేని పక్షంలో ఎన్నికల అధికారులు తిరస్కరించడానికి అవకాశం ఉంది. ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఫొటో ఓటరు గుర్తింపుకార్డు లేదా 12రకాల కార్డులను మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఓటరు ఐడీ (ఎపిక్‌కార్డు) లేని వారు ఈ 12 రకాల కార్డులలో ఏదో ఒక కార్డు ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

1. ఇండియన్ పాస్‌పోర్టు 2. ఆధార్‌కార్డు 3. డ్రైవింగ్ లైసెన్సు 4.సర్వీసు గుర్తిపు కార్డు(కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి) 5. పాస్‌బుక్ (ఫోటోతో పాటు బ్యాంకు/ పోస్టాఫీసుల్లో జారీ చేసినవి) 6. పాన్‌కార్డు 7. స్మార్ట్‌కార్డు(కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి) 8. ఉపాధి హామీపథకం జాబ్‌కార్డు 9. ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసినవి) 10. ఫోటో పింఛను పత్రం 11. ప్రత్యేక వైకల్యం కార్డు(కేంద్ర ప్రభుత్వం జారీచేసింది) 12. అధికారిక గుర్తింపు కార్డు(ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసినవి)

- తిరుపతి (నేరవిభాగం)/తిరుపతి(కలెక్టరేట్)